జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



గిద్దలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా



బొద్దికూరపాడులో వివరాలు తెలియజేస్తున్న డాక్టర్ రత్నం



దొనకొండ: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ



కొత్తపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



కల్లూరులో పౌష్టికాహారాన్ని రుచి చూస్తున్న అధికారులు, నాయకులు

గిద్దలూరు రూరల్ : ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. వైద్యశిబిరంలో ఆరోగ్య పరీక్షలతో పాటు హెల్త్ స్క్రీనింగ్ రికార్డులు డిజిటలైజ్ చేయడం ద్వారా పేదల ఆరోగ్యంపై శ్రద్ధకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్యరంగాన్ని బలోపేతం చేయడం శుభపరిణామమన్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు స్పెషలిస్టు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ రామకృష్ణయ్య, తహసీల్దార్ సీతారామయ్య, సీడీపీఓ జ్యోతి, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టారని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని నరజాముల తండా గిరిజన గూడెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షా హెల్త్ క్యాంపు నిర్వహించారు. సుమారు 150 మంది హాజరు కాగా డాక్టర్లు రవినాయక్, డాక్టర్ నయాజ్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రామాంజినాయక్‌లు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ మందా లాజర్, సర్పంచ్‌లు బాలునాయక్, స్వామి, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఎంఈవో ఇందిరప్రసాద్, ఈవోఆర్డీ శరత్‌బాబు పాల్గొన్నారు.

కంభం: మండలంలోని రావిపాడులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ ముఖ్య అతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకే స్పెషలిస్టు వైద్యులు వచ్చి వైద్య సేవలందిస్తున్నారని, ఈ అవకాశాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ వరికుంట్ల భువనేశ్వరి, ఉప సర్పంచ్ కంభాల విమల, ఎంపీటీసీ వరికుంట్ల బాలసుబ్బులు, ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, వరికుంట్ల పెద్దకోటేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురంలో జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు శుక్రవారం నిర్వహించారు. వైద్య నిపుణులు డాక్టర్ పృద్వీరాజ్, వికాష్, ఇమ్రాన్ అజాద్, వైష్ణవి, రమేష్‌కుమార్, కవితల ఆధ్వర్యంలో 354 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ డీవీబీ వరప్రసాద్, ఎంపీడీఓ పార్వతి, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందించడమే జగనన్న సురక్ష ధ్యేయమని సర్పంచ్ వల్లభనేని పవన్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నగుడిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఎంపీటీసీ రాధాకృష్ణతో పాటు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరమని ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ అన్నారు. శుక్రవారం పొదిలి మండలంలోని కొండాయపాలెం సచివాలయం వద్ద వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మొత్తం 551 ఓపీలు రాగా 24 మందిని పెద్దాసుపత్రులకు సిఫార్సు చేశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఎం.సుగుణకుమార్, బ్లెస్సీ, జి.ఆనందబాబు, సీహెచ్ సుష్మా, హెల్త్ సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని చింతగుంటలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపీడీఓ శ్రీనివాస మూర్తి, తహసీల్దార్ షాజిదా పర్యవేక్షించారు. వైద్యులు బాలయ్య, నరేంద్ర కుమార్, పృథ్వీరాజ్, సురేఖ, గైనకాలజిస్టులు వైద్య సేవలు అందించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

మార్కాపురం రూరల్: పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని గజ్జలకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.సుమిత పేర్కొన్నారు. రాయవరం-2లో శుక్రవారం 517 మందికి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిశోర్‌రెడ్డి, విజయ్‌కుమార్, డేవిడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని సర్పంచ్ తోకల నాగమల్లేశ్వరి అన్నారు. మండలంలో తంగిరాలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారన్నారు. ఈఓఆర్డీ శ్రీనివాసులు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ బీసీ మండల నాయకులు తోకల ఆవులయ్య, ఆరోగ్య, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యసేవలు

తాళ్లూరు (ముండ్లమూరు): వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి బొద్దికూరపాడులో శుక్రవారం పరిశీలించారు. 12 మందికి వీల్‌చైర్స్ అందజేశారు. తహసీల్దార్ కె.వి ప్రసాదరావు, ఈఓఆర్డీ కేఎస్‌రాజు, సర్పంచ్ మందా శాంసన్, ఎంపీటీసీ బాలకోటయ్య, నాయకులు పులి ప్రసాదరెడ్డి, బ్రహ్మారెడ్డి, గోపాలరెడ్డి, డాక్టర్లు మానిక, రాజేష్‌యాదవ్, ప్రణవి, అరుణకుమారి పాల్గొన్నారు.

దొనకొండ: ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి పరిక్షలు పరిశీలించారు. తహసీల్దార్ యం.సువర్ణ, ఎంపీపీ ఉషామురళి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ గొంగటి మహేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

దర్శి: కొత్తపల్లిలో ఎంపీపీ గోళ్ళపాటి సుధా అచ్చయ్య, సర్పంచ్ రాము పరిశీలించారు. ఎంపీడీఓ కుసుమకుమారి, డీడీ రవిశంకర్, వెన్నపూస వెంకటరెడ్డి, కుమ్మిత అంజిరెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు: జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కల్లూరులో మాట్లాడారు. సర్పంచ్ నక్కా రామకృష్ణ, ఎంపీడీఓ బి. శంకరరావు, తహసీల్దార్ యంజ్వాలా నరసింహం, నాయకులు సాదం నాసరయ్య పాల్గొన్నారు.



పెద్దారవీడులో..



కొండాయపాలెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



చింతగుంటలో మందులు అందజేస్తున్న కన్వీనర్



బేస్తవారిపేట: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



పుల్లలచెరువులో..



కంభం: రావిపాడులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తులశమ్మ



పెద్దదోర్నాలలో..

క్లుప్తంగా

ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే అన్నా



ఎమ్మెల్యే అన్నాను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గిద్దలూరు రూరల్: స్థానిక నాయక్ వీధిలోని అల్ అజ్ సయ్యదినా ఖాజా రహంతుల్లా నాయబ్ రసూల్ స్వామి దర్గా 19వ ఉరుసు మహోత్సవంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శుక్రవారం ఘన స్వాగం పలికారు. దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి స్వామి వారి ప్రసాదాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట నగర పంచాయతీ చైర్మన్ పి.వెంకట సుబ్బయ్య, ఇతర నాయకులు ఉన్నారు.

కేదారేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కేపీ పూజలు



స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ కుటుంబ సభ్యులు

తర్లుపాడు: మాస శివరాత్రిని పురస్కరించుకుని కేతగుడిపిలోని గంగా పార్వతీ సమేత కేదారేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు రాము, రాఘవస్వామి ఆశీర్వచనం అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, ఆయన సతీమణి సుబ్బమ్మ, సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, లత, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి దంపతులు, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, చిన్న కొండారెడ్డి, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొలిరెడ్డి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

బిందు సేద్యంతో ఉపయోగాలు

పెద్దారవీడు: బిందు సేద్యంతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని ప్రాంతీయ అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో పోతంపల్లిలో ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బిందు సేద్యం పరికరాలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బిందు సేద్యం పరికరాల వినియోగం, వాటి శుభ్రత, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. నీటి ఆదా, అధిక విస్తీర్ణం, విద్యుత్ ఆదా, కలుపులు తగ్గుదల, నాణ్యమైన అధిక దిగుబడి, ఎత్తు పల్లాల భూములకు అనుకూలం తదితర ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. సన్న చిన్నకారు రైతులకు 90 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రీమియర్ కంపెనీ ప్రతినిధులు పాలంకిరెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

అవసరమైన పనులు గుర్తించాలి

దర్శి: ఉపాధి హామీలో అవసరమైన పనులను గుర్తించాలని స్టేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారి శాంతారావు సూచించారు. స్థానిక మండల సర్వసభ్య సమావేశం మాట్లాడారు. పనుల ప్రణాళికలు చేయడంలో అలసత్వం లేకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఎంపీడీఓ కుసుమకుమారి, ఏపీఓ కళ్యాణి సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీలో ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం

పుల్లలచెరువు: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థి నిఖిల్ చంద్ ఢిల్లీలో సత్తా చాటాడు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడు సహకారంతో ఇటీవల ఢిల్లీ జరిగిన పదో ఇన్‌స్పైర్ మనక్ వైద్య వైజ్ఞానికి ప్రదర్శనలో విద్యార్థి రూపొందించిన ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ఫక్షర్ వైహ్యక్సమిషన్ ప్రాజెక్టు ఎంపికైంది. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదగా విద్యార్థి ప్రశంసపత్రం, పురస్కారం అందుకుని శుక్రవారం పాఠశాలకు వచ్చాడు. హెచ్ఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, మాజీ విద్యాకమిటీ చైర్మన్ గురునాథం, ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానిబాషా పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

మార్కాపురం టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 200 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బుస్సెట్టి నాగేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్‌రసూల్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అప్రమతంగా ఉండాలి

బేస్తవారిపేట: డిజిటల్ లావీదేవీలు, సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలని ఏపీజీబీ మేనేజర్ రామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఫేక్ మేసేజ్‌లను చూసి మోసపోవద్దని సూచించారు. డిజిటల్ నగదు చెల్లింపులపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని కోరారు. ఏపీజీబీ అందించే ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఈ-డిపాజిట్లపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై కళాజాతతో అవగాహన కల్పించారు. హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

మార్కాపురం: రెడ్డి సంక్షేమ సంఘం మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐదేళ్లలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు, పేదలకు అండగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో డి.శివారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు కోల్పోయిన మహిళకు ఆర్థిక సాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డులో నివాసం ఉంటున్న ఆశా వర్కర్ జ్యోతి ఇటీవల అనారోగ్యానికి గురై తన రెండు కాళ్లు కోల్పోయిందని తెలుసుకుని యువా కేర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆరీఫుద్దీన్ దాతల సహకారంతో శుక్రవారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాకుండా ఆమెకు నిత్యావసరాలు, మందులు అందజేశారు. ఆరీఫుద్దీన్ మాట్లాడుతూ హబీబ్‌ఖాన్ ద్వారా ఆమె సమస్యను గుర్తించి మానవతా దృక్పదంతో ఆదుకునేందుకు ముందుకొచ్చామని తెలిపారు. ప్రజాస్వామ్య శాంతి సేవ సంస్థ నాయకులు ఆజాద్‌ఖాన్, బాలయ్య యాదవ్, వెంకటయ్య యాదవ్, యువకేర్ సంస్థ ఉపాధ్యకుడు మానం గంగాధర్‌రెడ్డి, సభ్యులు మాలిక్ భాష, దిలీఫ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న వెదురు బొంగులు పట్టివేత

కంభం: అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న బార్బిస్టిక్స్‌ను తురిమెళ్ల సమీపంలో ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో జరిగింది. శుక్రవారం గ్రామ పెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

టెలికం సేవలపై అవగాహన

మార్కాపురం: టెలికం సేవలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని భారత టెలికం నియంత్రణ ప్రాధికార సంస్థ(ట్రాయ్) కాగ్ మెంబర్ డాక్టర్ బత్తుల సంజీవరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో టెలికం సేవలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మొబైల్ కనెక్షన్లు, ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ పరిష్కారాలు, సేవల నాణ్యత, పర్యవేక్షణ, బిల్లింగ్ విధానం, పోర్టబులిటీ, టారిఫ్, వినియోగదారుల రక్షణ, డియాక్టివేషన్ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఓడీలు వరలక్ష్మి, బీఎస్ఎన్ఎల్ అధికారి రంగారెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి, కమ్యూనిటీ లీడర్ వెంకటరత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు ప్రభుత్వ భూములను పరిశీలించారు. పులిపాడు, పెద ఉల్లగల్లు, ఉమామహేశ్వరపురం, నూజిళ్లపల్లిలో పలు భూములను పరిశీలించారు. తహసీల్దార్ నయీం అహ్మద్, వీఆర్వోలు కోటయ్య, దయానందం, రమణ, పున్నారావు ఉన్నారు.

11 నోటిపై చెరువులు నింపుతాం

దర్శి: సాగర్ జలాలతో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ, పబ్లిక్ హెల్త్‌కు చెందిన 11 నోటిపై చెరువులను నింపుతున్నట్లు ఎన్ఎస్‌పీ డీఈ అక్బర్ బాషా తెలిపారు. శుక్రవారం సాగర్ జలాలు దర్శి ఓబీసీ వద్దకు చేరుకున్నాయి. చీమకుర్తి డీఈ గిరిబాబు, ఏఈలు వెంకట్రావు, భరత్, శివరామకృష్ణ, క్రాంతికుమార్, విజయ్ పాల్గొన్నారు.

ఐక్యతా విజయపథం జయప్రదం చేయండి

ముండ్లమూరు: మాజీ ఐఏఎస్ అధికారి కేఎస్ఆర్‌కే విజయకుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఐక్యతా విజయపథం పాదయాత్ర జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 17న ముండ్లమూరు మండలంలో విజయకుమార్ పాదయాత్ర ఉంటుందన్నారు. పాలెపోగు డగ్లస్, దార్ల కోటేశ్వరరావు, గోపనబోయిన వెంకటరావు, నాయకులు పులి వికాస్, బంటుపల్లి ప్రకాష్, మోషే, పిలిఫ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

ముండ్లమూరు: మండలంలోని బసవాపురం గ్రామానికి చెందిన గర్నెపూడి యశోధ (35) అనే బాలింత గుంటూరులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా భర్త పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల ఒకటో తేదీన గర్నెపూడి పెద అక్కరాజు, యశోద కుటుంబ సభ్యులకు, గంగవరపు నాగేంద్రం, జాన్‌పాల్ కుటుంబ సభ్యులకు గొండవ జరిగింది. ఈ గొడవలలో యశోధదను నాగేంద్రం, జాన్‌పాల్ మరో ఐదుగురు నెట్టడంతో కింద పడింది. యశోద ఎనిమిది నెలల బాలింత. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యశోద మృతి చెందగా ఆమె భర్త పెద అక్కరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

29న దూదేకుల సింహగర్జన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

కొనకనమిట్ల: చట్టసభల్లో దూదేకులకు సముచిత స్థానం కల్పించాలనే నినాదంతో ఈ నెల 29న గుంటూరులో దూదేకుల సింహగర్జన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు దూదేకుల(నూర్‌బాషా) సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు డి.పెద్దమస్తాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గనివానిపాడు, మునగపాడు, గార్లదిన్నె గ్రామాలలో దూదేకుల సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెద్దకాశిం, చిన్న మీరావళి, పెద్దమీరావళి, షరీఫ్, నాసరయ్య, కుంటి కాశీం, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ షోరూమ్‌లో దూదేకుల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను సంఘ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మీరావలి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదాం సాహేబ్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఖాశింపీరా, కౌన్సిలర్ ప్రసాద్, మహమ్మద్ అలీ, బాబా సాహేబ్, సప్తగిరి, నాసర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ మహిళా రిజర్వేషన్‌పై అవగాహన సదస్సు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజు పారామెడికల్ శిక్షణా కాలేజీ ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటలకు బీసీ మహిళా రిజర్వేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బీసీ నాయకులు కంచర్ల కోటయ్యగౌడ్, ఓ.వెంకటయ్య యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ బీసీలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

16 నుంచి గొట్లగట్టులో గడప గడపకు మన ప్రభుత్వం



వలంటీర్లకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ

కొనకనమిట్ల: ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గొట్లగట్టు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాస మూర్తి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం గొట్లగట్టు గ్రామ సచివాలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. 16న సాయంత్రం నాయుడుపేట ఎస్సీ కాలనీ, నాయుడుపేట, 17న సాయంత్రం వెలుగొండ్రాయునిపల్లి బీసీ, ఎస్సీ కాలనీలు, గొట్లగట్టు ఎస్సీ కాలనీలో, 18న సాయంత్రం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభంతోపాటు మెయిన్ రోడ్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ వివరించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ముందుగా గడప గడపకు వెళ్లి కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మార్కాపురం : క్రీడాకారులతో హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నందినితో ఉపాధ్యాయులు



గొట్లగట్టు క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మార్కాపురం/తర్లుపాడు/కొనకనమిట్ల: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో మార్కాపురం, తర్లుపాడు జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు సత్తా చాటారు. 200 మీటర్ల పరుగుపందెం, 5 కి.మీ నడక, టెబుల్ టెన్నిస్, రగ్బీ పోటీల్లో మార్కాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మణికంఠ, ఎస్ రాజు, సంతోష్‌కుమార్, విలియం కెల్లీ కింగ్, కె. శ్రీనివాసులు, ఠాగూర్‌బాబు, విన్ని జయంత్, జి. సుశాంత్ రెడ్డి, వెంకట నారాయణ ప్రతిభ చాటారని హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి తెలిపారు. అలాగే తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బి.నందిని రాష్ట్ర స్థాయి అండర్-17 బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.సుధాకర్ తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కొనకనమిట్ల మండలం గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14లో బాలుర విభాగంలో ఎం.ఉమాశంకర్, పి.నరహరి, ఆర్.అశ్వనాథ్, బాలికల విభాగంలో ఆర్.లక్ష్మీకల్పన, సీహెచ్ మహేశ్వరి, అండర్-17లో జి.శివమణి ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు.

సీఎంను కలిసిన తొండమల్ల పుల్లయ్య



సీఎం వైఎస్ జగన్‌తో పుల్లయ్య కుటుంబ సభ్యులు

గిద్దలూరు రూరల్: రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా తొండమల్ల పుల్లయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో తాడేపల్లెలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొడమల్ల పుల్లయ్య స్వగ్రామం గిద్దలూరు మండలం నరవ గ్రామం కాగా అతడు తిరుపతిలో వ్యాపారరీత్యా స్థిరపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన సేవలను గుర్తించిన టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆయనకు నాయీబ్రాహ్మణ చైర్మన్ పదవి దక్కిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయీబ్రాహ్మణులను ప్రత్యేకంగా గుర్తించిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు.